# ప్రజాశక్తి

సోమవారం 11 డిసెంబర్ 2023 8 పేజీలు





ఎన్‌టిఆర్



కృష్ణా

# విత్తన వెతలు



- తుపానుకు కొట్టుకుపోయిన మినప మొక్కలు
- అపరాల విత్తనాల కోసం రైతుల అగచాట్లు
- బహిరంగ మార్కెట్‌లో భారీగా పెరిగిన ధరలు
- క్వింటా ధర రూ.10 వేల నుంచి 15 వేలకు పెంపు

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**

మినుము విత్తనాల ధరలకు రెక్కలొచ్చాయి. వరి మాగాణుల్లో రబీలో రెండో పంటగా జల్లిన మినుములు తుపానుకు తుడిచిపెట్టుకుపోయాయి. పొలాల్లో నీరు అధికమై మినప మొక్కలు కుళ్లిపోయాయి. మరోసారి వెదజల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినుము విత్తనాలు అందుబాటులో లేవని చెబుతూ వ్యాపారులు అమాంతంగా వాటి ధరలు పెంచారు. తుపానుకు ముందు క్వింటా (100 కిలోలు) రూ.10,500 ఉన్న మినుము విత్తనాల ధరలు తాజాగా రూ.15 వేలకు పెరిగాయి. తుపానుకు ముందు విత్తనాలు చల్లి నష్టపోయిన రైతులకు మాత్రమే 80 శాతం ఇన్‌ఫుడ్ సబ్సీడీపై ఆర్‌బికెల ద్వారా మినుము విత్తనాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మిగిలిన రైతులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో విత్తనాల ధరలు అనూహ్యంగా పెరగడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్ వరి మాగాణుల్లో రబీలో రెండో పంటగా మినుము సాగు చేస్తారు. కృష్ణాజిల్లాలోని పంటకు అనుకూలంగా ఉన్న 2,84,165 ఎకరాల నల్లరేగడి నేలల్లో రబీలో మినుము సాగవుతుంది. నవంబర్ రెండో వారం నుంచి డిసెంబర్ 15 మధ్యకాలం మినుము విత్తనాలు జల్లడానికి అనుకూలంగా ఉంటుంది. మనుషులతో కోతలకు రెండు రోజులు ముందే వరి మాగాణుల్లో ఒక్కో ఎకరాకు 20 కిలోల వెద జల్లుతారు. యంత్రాలతో కోత, నూర్పిడి పూర్తి చేసిన రైతులు పొలాన్ని దమ్ము చేసి మినుము విత్తనాలు జల్లుతారు. తుపానుకు ముందు జిల్లాలోని 40 వేల ఎకరాల్లో మినుము విత్తనాలు జల్లారు. తుపానులో మొలకలొచ్చిన మినుము మొత్తం నీట మునిగి మురిగిపోయింది. పూర్తిస్థాయిలో మినుము విత్తనాలు వెద జల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో రైతుల అవసరాలకు 57 వేల (మిగతా 6లో)

# 2041 నాటికి పెరగనున్న జనాభా

- విఎంసి పరిధిలో 25 లక్షలకుపైగా పెరిగే అవకాశం
- ఐయుసి బేస్‌లైన్ స్టడీలో వెల్లడి

**ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి**

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 2041 నాటికి భారీ ఎత్తున జనాభా పెరిగే అవకాశం ఉంది. యూరోపియన్ యూనియన్ ఇంటర్‌నేషనల్ కార్పొరేషన్ (ఐయుసి) ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రాజెక్టును నగరంలో ఎలా చేపట్టాలనే దాని కోసం చేపట్టిన ఒక బేస్‌లైన్ స్టడీలో జనాభా పెరుగుదలకి సంబంధించిన ఆసక్తికరమైన అంశాలు వెల్లడించారు. 2041 నాటికి విఎంసి జనాభా 25,47,480 వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. తొలుత విఎంసి 30 చ.కి.మీ విస్తీర్ణంలో 1 ఏప్రిల్ 1888లో మున్సిపాలిటీగా ఏర్పాటైంది. తర్వాత 1960లో గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్‌గా 1981లో అప్‌గ్రేడ్ చేశారు. 1985లో గుణదల, పటమట, భవానీపురం గ్రామ పంచాయతీలతో పాటు పాయకాపురం, కుందారివారి కండ్రిక గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ప్రస్తుతం విఎంసి 61.88 చదరపు కిలోమీర్ల పరిధి మేరకు విస్తరించి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం విఎంసి పరిధిలో 10,34,358 జనాభాను కలిగి ఉంది. అంటే ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పట్టణ జనాభాలో దాదాపు 3.92 శాతంగా ఉన్నట్లు అంచనా. మరో వైపు ప్రస్తుతం విఎంసి జనాభా 13,55,510 వరకు ఉన్నట్లు అంచనా. జనసాంద్రత కూడా (మిగతా 6లో)

| సంవత్సరం | జనాభా | వాస్తవ మార్పు | మార్పు శాతం |
|---|---|---|---|
| 1901 | 24,224 | -- | -- |
| 1911 | 32,867 | 8,643 | 35.68 |
| 1921 | 44,159 | 11,292 | 34.36 |
| 1931 | 60,427 | 16,268 | 36.84 |
| 1941 | 86,184 | 25,757 | 42.62 |
| 1951 | 161,198 | 75,014 | 87.04 |
| 1961 | 234,360 | 73,162 | 45.39 |
| 1971 | 344,607 | 110,247 | 47.04 |
| 1981 | 527,884 | 183,277 | 53.18 |
| 1991 | 708,316 | 180,432 | 34.18 |
| 2001 | 941,760 | 233,444 | 32.96 |
| 2011 | 1,034,358 | 92,598 | 9.83 |





## 'వన' సందడి

కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో వనాల్లో సందడి నెలకొంది. కుల, ఉద్యోగ, పలు సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో వనాలు జనంతో నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

...వార్తలు లోపలి పేజీల్లో



నున్న మామిడి తోటలో పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

# ఆహార పదార్థాల కల్తీపై నిఘా

- నిరంతరం తనిఖీలు, కేసులు నమోదు
- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గౌస్ మొహిద్దీన్

**ప్రజాశక్తి-విజయవాడ**


ఆహార పదార్థాల కల్తీని నిరోధించడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉమ్మడి కృష్ణాజిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ (ఎఎఫ్‌సి) గౌస్ మొహిద్దీన్ అన్నారు. కల్తీలకు పాల్పడిన వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆహార పదార్థాలు కల్తీ కాకుండా జిల్లాలో ఆహార కల్తీ నిరోధక శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆయన 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న :** కల్తీ నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు కల్తీ కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, కల్తీకి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

**ప్రశ్న :** ఆహార పదార్థాల కల్తీని ఎలా గుర్తిస్తారు?

విజయవాడ లాంటి నగరంలో ఏదో ఒక చోట ఆహార పదార్థాల కల్తీ అనేది జరుగుతూనే ఉన్నా కానీ... సిబ్బంది సాధ్యమైన మేరకు వాటిని నిరోధించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. నిరంతరం ఇన్స్‌ఫెక్షన్ నిర్వహిస్తూ ఎక్కడెక్కడ కల్తీలు జరుగుతుంటాయో అటువంటి వాటిని శాంపిల్స్ తీయడం జరుగుతుంది. తమ పరిశీలనలో తేడా కనిపిస్తే తప్పని సరిగా కేసు నమోదు చేయడం, ఫెనాల్టీలు విధించడం





జరుగుతుంది.

**ప్రశ్న :** నెలకు ఎన్ని శాంపిల్స్ తీయవచ్చు?

సాధారణంగా నిబంధనల ప్రకారం ఒక్కో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో నెలకు 12 నుంచి15 వరకు శాంపిల్స్, మరో 25 సర్వేలెన్స్ (వార్నింగ్, హెచ్చరిక) టైపులో తీయాల్సి ఉంటుంది.

**ప్రశ్న :** సహజంగా మార్కెట్‌లో ఎన్ని రకాల కమాడిటీస్ (ఆహారపదార్థాలు) ఉంటాయి?

సాధారణంగా కమాడిటీస్ 40 నుంచి 50 రకాలు, ఆపైన కూడా ఉండవచ్చు. రకరకాల ఫుడ్ ఐటమ్స్ తయారవుతుంటాయి.

**ప్రశ్న :** కల్తీలను ఎలా గుర్తిస్తారు?

ఆయిల్స్ కానీ, ఇతర తినుబండారాల్లో కల్తీలను పరిశీలించేందుకు టిపిసి మీటర్ (టోటల్ పోలార్ కాంపౌండ్స్) మిషన్ ద్వారా గుర్తించడం జరుగుతుంది. సాధారణంగా 25 శాతం వరకు టిపిసిని పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంటుంది.

**ప్రశ్న :** ఇటీవల ఎన్ని కేసులు నమోదు చేశారు?

గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఒక్కో ఇన్‌స్పెక్టర్ పరిధిలో 60 నుంచి 70 వరకు



కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు జెసి పరిధిలోకి వచ్చే కేసుల వరకు సుమారు 114 వరకు ఉంటాయి.

**ప్రశ్న :** ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలు, నూనెలు తదితర వాటి క్వాలిటీ చెకింగ్, వాటి పారామీటర్స్ ఎన్ని రకాలుగా ఉంటాయి?

ఏదేని ఆహార పదార్థం/ నూనెలు/ తదితర వాటి క్వాలిటీని గుర్తించడానికి పారామీటర్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటాం. మొత్తంగా 54 రకాల పారామీటర్స్ ఉంటాయి. ఆయిల్స్ లాంటి వాటికి 10 నుంచి 15 వరకు టెస్ట్‌లు (పారామీటర్స్)ను పరిగణలోకి (మిగతా 6లో)

# సందడిగా వన సమారాధనలు

**ప్రజాశక్తి - మైలవరం :** కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆఖరి ఆదివారం కావడంతో పలుకుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలు ఉత్సాహంగా కొనసాగాయి. పొందుకోల రోడ్‌లోని వివేకానంద గార్డెన్‌లో కాపు సంఘం, ఆర్యవైశ్య సంఘం, రజక, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలుచోట్ల వన సమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పెద్ద తేడా లేకుండా ఆటపాటలతో అందరూ ఉత్సాహంగా గడిపారు. కొన్ని సంఘాలకు అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకొన్నారు. ఆటపాటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. **కంచికచర్ల :** కార్తీక వనసమారాధనతో కంచికచర్ల మండలంలో పలుచోట్ల ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కంచికచర్ల మండలం గొట్టుముక్కల అటవీప్రాంతంలో మద్దులమ్మ దేవాలయం ప్రసిద్ధి చెందింది. ఆదివారం కంచికచర్ల మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు విజయవాడ తదితర ప్రాంతాల నుండి ఇంటిల్లిపాది యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం ఆటలు, పాటలతో సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి తోడు అటవీ ప్రాంతంలో ఎగువ నుండి మద్దులమ్మ దేవాలయం వైపుగా వచ్చే జలపాతంలో నీరు జాలువారుతున్న దశ్యం చూసి ఆనందం వ్యక్తం చేశారు. కీసర మామిడి తోటలు కిటకిటలాడాయి. **అజిత్ సింగ్ నగర్ :** సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధాన ఘనంగా నున్న మామిడి తోటలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు పాల్గొన్నారు. వనసమారాధనలో పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటం, ఎంతో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో రమణారావు, సాంబి రెడ్డి, ఆంజనేయులు సిపిఎం మహిళ విభాగ సభ్యులు ప్రజా సంఘాల సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని గౌరవరం గ్రామంలో కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం రాత్రి శుక శ్యామలాంబ సమేత రాజమల్లేశ్వర స్వామి కళ్యాణం అనంతరం ఆదివారం కోలాటాలు నడుమ మేళతాళాలతో భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు ఈ ఆలయం అర్చకులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** కార్తీకమాసం సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, శ్రీవాసవి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గొల్లపూడిలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య వైభవం పేరిట కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా 1008 దంపతులతో సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్తీక వనసమారాధనకు విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, కేశినేని ఫౌండేషన్ ఛైర్మన్ కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జనసేన విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్, జనసేన పార్టీ పిఏసి మెంబర్ ముత్తా శశిధర్ తదితరులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వి.వి.కె.నరసింహారావు , ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నాయకులు కొణిజేటి రమేష్, ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

**విజయవాడ :** ప్రజా సంఘాల విజయవాడ నగర కమిటీల ఆధ్వర్యంలో వేలాది మందితో ఉత్సాహంగా వన భోజనాలు జరిగాయి. కులాలు, మతాలు, వయసుల తేడా లేకుండా చిన్నారులు మొదలు వృద్ధుల వరకు మూడు వేల మందికి పైగా విజయవాడ సమీపంలోని నున్న మామిడి తోటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాల్లో ఉత్సాహపూరితంగా పాల్గొన్నారు. సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పౌర సంక్షేమ సంఘం, ప్రజానాట్యమండలి తదితర ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో నేడు జరిగిన పిక్నిక్ ఆనందదాయకంగా, క్రమశిక్షణయుతంగా జరిగింది. ఆటలాడారు, పాటలు పాడారు, నత్యాలు చేశారు, కలసి భోజనం చేశారు కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, బాలలు కుటుంబాలుగా తరలివచ్చారు. వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కతిక రూపాలు అందరినీ అలరించాయి, బహుమతి ప్రధానం చేశారు. ముగింపులో ప్రజాసంఘాల నేతలు సిహెచ్. బాబురావు, డి. కాశీనాథ్, కే.శ్రీదేవి తదితర నేతలు మాట్లాడుతూ కలిసి పాడటం, కలిసి ఆడటం, కలిసి భోజనం చేయటం మన సంప్రదాయం, సామరస్యానికి చిహ్నం అన్నారు. మతసామరస్యం, ప్రజల మధ్య ఐక్యతను నిలబెట్టుకోవాలని, సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బోయి సత్యబాబు, బి.రమణరావు, పి.కృష్ణ, గాదె ఆదిలక్ష్మి, శేషు మణి, ఈవి.నారాయణ, కే.సరోజ, ఝాన్సీ, నాగేశ్వరరావు, నిజాముద్దీన్, అప్పన్న, రంగారెడ్డి, సిహెచ్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సింగ్‌నగర్‌లో



వన్‌టౌన్‌లో...



జగ్గయ్యపేటలో



కంచికచర్లలో



మైలవరంలో

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాశక్తి - వీరులపాడు :** తుపాను వల్ల ముంపునకు గురైన వరి, పత్తి మిర్చి పంటలను కౌలు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధుల బందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ అత్యధికంగా వరి పంట నీటమునిగి మొలకలొచ్చాయని ఇప్పటికింకా పొలాల్లో నీరు బయటికి పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కోయాలంటే తేమ ఆరటానికి మరొక నాలుగు రోజులు పడుతుందని, ఈలోగా తడిసిన ధాన్యం పూర్తిస్థాయిలో మొలకెత్తుతుందని అన్నారు. మిర్చి పైరు అత్యధిక శాతం కాపుకు వచ్చేసిందని, రెండు రోజులు పాటు కురిసిన ఈ వర్షాలకు, తుఫాన్ గాలికి పూతరాలి మొక్కలు ఒరిగిపోవడం వల్ల తిరిగి లేపాల్చి వస్తుందని అన్నారు. ఒకసారి తుపాన్‌కి దెబ్బతిన్న మొక్క తిరిగి కోలుకుని దిగుబడి రావటం చాలా కష్టమని, ఈ దశలో 70 శాతానికి పైగా దిగుబడి తగ్గిపోతుందని రైతులంటున్నారు. పత్తి 40శాతం చేతికి వచ్చిందని, మిగిలిన పంట చెట్టు మీద ఉండగానే వర్షాలకు తడిసిపోవటంతో రంగు మారిపోయిందన్నారు. వరి, మిర్చి,పత్తి పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతులకు, కౌలు రైతులకు వెంటనే ప్రకటించి విడుదల చేయాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని, మిర్చి, పత్తి పంటలను ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల నాయకులు చాట్ల రవి, సిఐటియు నాయకులు షేక్ లాల్ అహ్మద్ గౌస్, కార్మిక సంఘం నాయకులు యం.సుందర్ రావు షేక్ మదర్ తదితరులు పాల్గొన్నారు. వరి, మిర్చి, కంది, పుల్లశనగ, పత్తి ఇతర పంటలను సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ రైతు విభాగం, సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ జిల్లాలో 16 మండలాలలో 260 గ్రామాలలో పర్యటించినట్లు తెలిపారు. పంటలు పూర్తిగా నీట మునిగిపోయాయని, మామిడి పూత దశలో రాలిపోయిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. సిఐటియు వీరులపాడు మండల కార్యదర్శి షేక్ గౌస్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి, సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** తుఫాను వలన వరి పంట అత్యధిక శాతం నేలకొరిగి పోవడంతో నేటికీ నీళ్లలో మునిగిపోయి ఉండటంవల్ల వరి మొలకెత్తుతున్న తెలిపారు. రైతు కూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు యం.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు యాదల నాగేశ్వరరావు ,జిల్లా కమిటీ సభ్యులు కొమ్మినేని కొండ, పానుగంటి గురునాథం ,రైతులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** మండలంలో దెబ్బతిన్న పొగాకు పంటలను మండల టిడిపి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న 200 ఎకరాల పొగాకు తోటలన్నీ తుఫాను ప్రభావంతో పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు.



నందిగామలో వరి పంట పరిశీలిస్తూ...



వీరులపాడులో వరిని పరిశీలిస్తున్న నాయకులు



వీరులపాడులో మిర్చి పంటను పరిశీలిస్తూ...



రెడ్డిగూడెంలో పొగాకు పంటను పరిశీలిస్తున్న నాయకులు

## జలజీవన్ మిషన్ ద్వారా బోరు బావి

**ప్రజాశక్తి - గంపలగూడెం:** మండలం లోని సత్యాలపాడు గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన నిధులతో ఆదివారం బోరుబావిని వేయించినట్లు ఆ గ్రామ వైసిపి నాయకులు కామసాని శంకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో ప్రజల నీటి అవసరార్థంలో భాగంగా ఈ జలజీవన్ మిషన్ కింద 34 లక్షలు మంజూరు కాగా, అందులో భాగంగా బోరుబావిని వేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నపూస గోవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కామసాని విజయనిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.







ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో మహిళలు

## ప్రచారం

**ప్రజాశక్తి - తిరువూరు :** పర్యా వరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నిర్మూలన ఎంతో అవసరమని ఎపి పర్యావరణ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మహిళలు విస్తృత ప్రచారం నిర్వహించారు. తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని వివిధ కాలనీలలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు కట్టూరి జయారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సమాజంలో చాలా ముఖ్యమన్నారు. అందుకు ప్లాస్టిక్ నిర్మూలించి గుడ్డతో, నారతో తయారు చేసిన సంచులు, కవర్లను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు దాని వల్ల అనేక రకాలైన వాతావరణ కాలుష్యంతో పాటు అనేక రకాలైన వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ సంస్థ అధ్యక్షుడు అన్నపరెడ్డి డేవిడ్ రాజు, మురళి, శంకర్, ప్రకాష్ మహిళలు పాల్గొన్నారు.

## దుగ్గి చెన్నారెడ్డికి పరామర్శ

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** ముచ్చినపల్లి గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దుగ్గి చెన్నారెడ్డి(97)ని సిపిఎం నాయకుల బృందం ఆదివారం నాడు పరామర్శించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దుగ్గి చెన్నారెడ్డి తిరువూరు తాలూకా నుండి ఛీఫ్ కొరియర్‌గా పనిచేసిన చెన్నారెడ్డి డెబ్బైయ్యో దశకంలో కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన చీలిక సమయంలో చెన్నారెడ్డి సిపిఎం వైపు మొగ్గు చూపి పార్టీ ఎదుగుదలకు కషి చేసి కొంతకాలం సిపిఎంలో కొనసాగారు. ఇటీవల కాలంలో ఈయన కొంత అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, నాయకులు సిహెచ్.మాధవ రెడ్డి, కష్ణారెడ్డి, అప్పిరెడ్డి, రాధాకష్ణ రెడ్డి, జంగా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెన్నారెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

## ఐడిఎఫ్‌సి బ్యాంకుకు ఆదరణ

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఐడీఎఫ్‌సి ఫస్ట్ ప్రైవేట్ బ్యాంకింగ్, సంస్థ అని, ఎక్కువ మంది ఆదరణ పొందిన బ్యాంక్‌గా వుందని బ్యాంక్ హెడ్ వికాస్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐడీఎఫ్సీ ఫస్ట్ ప్రైవేట్ హురున్ ఇండియాస్ టాప్ 200 సెల్ఫ్-మేడ్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2023 జాబితాలో స్థానం సాధించినట్లు తెలిపారు. వినియోగదారులకు సేవలను అందించడంతో పాటు, అనేక పథకాలను కూడా అందిస్తున్నామని అన్నారు. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్రాంచ్‌లను విస్తరించి సేవలను అందించడంతో ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు.

# అనుమతుల్లేకుండా వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటు

- నిబంధనలు పాటించని యాజమానులు
- పట్టించుకోని అధికారులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** తక్కువ కంటే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించే మార్గం వుందా అని ఆలోచిస్తే ఠక్కున చెప్పే సమాధానం శుద్ధ జల కేంద్రం. ఇటీవల కాలంలో శుద్ధ జలం సేవించడం వల్ల రోగాలు వ్యాపించే అవకాశం తక్కువని ఆరోగ్యానికి మంచిదని తప్పుడు ప్రచారం జరుగుతుండటంతో అనేకమంది కూలినాలి చేసుకునే వాళ్ళ నుంచి ధనవంతుల వరకు శుద్ధ జలాన్ని సేవిస్తున్నారు. ప్రతి ఒక్కరు శుద్ధజలం వాడుతుండటంతో ఈ వ్యాపారం మూడు కాయలు ఆరుపూలు గా కొనసాగుతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో అనేక మంది ఇంటివద్ద కాస్త చోటు ఉన్న వాళ్ళు మినరల్ వాటర్ ప్లాంట్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో, గ్రామాలలో ఆ వీధి ఈ వీధి అని తేడా లేకుండా ప్రతి వీధిలో 1 కి పైగా శుద్ధజల కేంద్రాలు ఉండే పరిస్థితి ఏరకంగా ఉందో అర్ధమవుతుంది. మూడు లక్షల



రూపాయల పెట్టుబడితో శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని, మినరల్ వాటర్ ప్లాంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని బట్టి రోజుకు వెయ్యి రూపాయలకు పైగా సంపాదిస్తున్నారు. ఇటీవల కాలంలో శుద్ధ జలం తోపాటు శీతల జలం కూలింగ్ వాటర్ సరఫరా చేస్తుండటంతో వీటికి మంచి గిరాకీ పెరిగి నిర్వాహకులకు మరింత ఆదాయం పెరిగింది. మండలంలో కొన్ని శుద్ధ జల కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టుకొస్తున్నా సంబంధిత అధికారులు వాటి వైపు చూసిన దాఖలాలు కనిపించడం లేదు. సహజంగా శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేయటానికి నిబంధనల ప్రకారం ఒక సెంటు స్థలం దానికోసం సాంకేతిక నిపుణులు ఉండటంతో పాటు ఐఎస్ఐ మార్కు తీసుకోవాల్సి ఉంది. ఇదంతా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం నిబంధనలు పాటించకుండా తయారు చేసిన నీటిని తాగినవారు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. రెండు మూడు రోజులకు పాటు నిల్వ ఉంచిన నీటిని కొందరు నిర్వాహకులు సరఫరా చేస్తుండటంతో పిల్లలు డయేరియా వ్యాధి బారిన పడటానికి అవకాశం ఉంది. ప్రస్తుతం పట్టణంలో ఉన్న కొన్ని శుద్ధ జల కేంద్రాలకు ఐఎస్ఐ సర్టిఫికెట్ కొన్నిటికి మాత్రమే ఉండటం కోసం కొసమెరుపు. చాలాచోట్ల యంత్రాలు తుప్పు పట్టి ఆ పరిశుభ్రంగా ఉంటాయి. ఇక వాటర్ తయారు చేసిన తేదీ గడువు వివరాలు నోటీస్ బోర్డులో మచ్చుకైనా కనపడవు. కొందరు మినరల్ వాటర్ ప్లాంట్ వ్యాపారులు వాటర్ ప్యాకెట్ లో నీటిని శుద్ధి చేయకుండానే నింపుతూ సరఫరా చేస్తుండటంతో ప్లాస్టిక్ వాసన వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుద్ధజలం వల్ల కలిగే అనర్ధాలను ప్రజలకు వివరించడం తో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కల్లుగీత కార్మికుడు మృతి

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన కలుగీత కార్మికుడు జంపన శ్రీనివాసరావు (50) ఆదివారం ప్రమాద వశాత్తు మరణించాడు. తాడిచెట్టు మీద నుండి కిందకు తిగుతున్న సమయంలో కరెంట్ వైర్లు తగలటం వలన షాక్ గురై కిందపడి చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.





వరిని పరిశీలిస్తున్న శాసనసభ్యులు రమేష్ బాబు

## రైతులను ఆదుకుంటాం : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-చల్లపల్లి :** మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతులు, కౌలు రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి న్యాయం చేస్తారని,ఎవరూ అధైర్య పడవద్దని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు హామి ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైసీపీ రైతు విభాగం ఉమ్మడి కష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు చల్లపల్లి మండలం పాగోలు పరిధిలో పంటలు పరిశీలించారు. లంకతోట గ్రామంలో కౌలు రైతు కుందేటి కోటేశ్వరరావు చేలో వరి పనలు పరిశీలించారు. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు, కౌలు రైతులను ఆదుకునేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. మొలకలు వచ్చిన, రంగు మారిన ధాన్యం మొత్తం మద్దతు ధరకే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వంశీ

## బాధితుడికి వంశీ పరామర్శ

**ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :** ఇటీవల అనా రోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీటీసీని ఆదివారం ఎమ్మెల్యే వంశీ పరామర్శించారు. బాపులపాడు మండలం బండారగూడెం గ్రామం మాజీ ఎంపీటీసీ పామర్తి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే వంశీ బండారగూడెంలోని సత్యనారాయణ గహానికి వెళ్లి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అన్ని విధాల అండగా ఉంటానన్నారు. తదనంతరం డాక్టర్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలిపి వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ఎమ్మెల్యే తో పాటు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాటు పరిశీలించినట్లు తెలిపారు.



## రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జొన్నవిత్తుల

**ప్రజాశక్తి -మొవ్వ :** ప్రముఖ సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ఆదివారం సాయంత్రం నాట్య క్షేత్రమైన కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేలు పైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఇదే సమయంలో దేవాలయ ప్రాశస్త్యాన్ని, భూముల వివరాలను, వేద పండితుల వివరాలను గ్రామస్తుల ద్వారా సేకరించారు. కూచిపూడి అగ్రహారాన్ని, శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించటం ఆనందకరమైన సంఘటనగా వివరించారు. దేవాలయాల ప్రాశస్త్యాన్ని సమాజానికి తెలియజేసేందుకు గ్రంధాన్ని రూపొందిస్తున్నామని దీనిలో భాగంగానే ప్రాచుర్యం గల దేవాలయాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

## పాముకాటు బాధితుడికి పరామర్శ

**ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:** ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న తుమ్మల రాముడు అనే వ్యక్తిని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు పరామర్శించారు. బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామానికి చెందిన తెలుగు దేశం కార్యకర్త తుమ్మల రాముడు పాముకాటుకు గురై పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆళ్ళ గ్రామ నాయకులతో కలిసి హాస్పిటల్ కి వెళ్లి తుమ్మల రాముడుని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఎంపిటిసి పుసులూరు లక్ష్మీనారాయణ ,గ్రామ ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు, వెనిగళ్ళ శేఖర్ తదితరులు ఉన్నారు.



# రోగికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం, ముసాబాద రైల్వేకాలనీకి చెందిన వేము నవీన్ కు ఇటీవల యాక్సి డెంట్ జరిగింది. తీవ్రగాయాలతో హైదరాబాదులోని హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటుండగా నవీన్ తండ్రి వేము జోజిబాబు గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్ళి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. తక్షణమే స్పందించిన యార్లగడ్డ వెంకట్రావు రూ. 20వేలు నగదు సాయాన్ని టీడీపీ నాయకుల చేతులమీదుగా అందించి ఆ కుటుం బానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పాలడుగు మల్లికార్జునరావు, గన్నవరం మండల పార్టీ ఉపాధ్యక్షులు కంచర్ల ఈశ్వరరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, యూనిట్ ఇంచార్జ్ సురేష్, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** ఉంగుటూరు మండలంలోని నాగవరప్పాడు గ్రామంలో ఆర్సీఐఎమ్ చర్చి చుట్టూ ఫెన్సింగ్ నిమిత్తం గన్నవరం నియోజకవర్గ



తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్ లక్ష రూపాయలు విరాళంగా అందించారు. చర్చి ఫెన్సింగ్ కు ఆర్థికసాయం చేయాలనీ సంఘ పెద్దలు గన్నవరం నియోజవర్గ టీడీపీ ఇంఛార్జి యార్లగడ్డ వెంకట్రావును సంప్రదించగా ఆయన సొంత నిధుల నుండి సోదరుడు యార్లగడ్డ సతీష్ బాబు చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్ ను సంఘ పెద్దలుకు అందచేసారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అరుమళ్ల వెంకటకష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైయిన్ల నిర్వహణలో విఫలం : టిడిపి



**ప్రజాశక్తి-ఉయ్యూరు :** డ్రెయిన్లు,మురుగు కాల్వల నిర్వహణలో ప్రభుత్వ వైఫ్యల్యం రైతులను నిండాముంచిందని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, నియోజకవర్గ తెలుగు రైతు నాయకుడు కాకాని శ్రీనివాసరావు, ఆరోపించారు. తుఫాన్ ప్రభావంవల్ల కురిసిన వర్షాలకు ఇప్పటికి ముదునూరు పొలాల్లో నీటిలో నానుతున్న వరిరపనలు, నే లవాలి నీటిలో మురుగుతున్న వరి పంటను స్థానిక పార్టీ నాయకులు దూసర అజయ్, రాము, పాలడుగు బాలజీ, మహిళానాయకురాలు మాధవీలత, రైతులతో కలసి ఆదివారం పరిశీలించారు. నీటిలో నానుతూ ఉన్న పనలనుండి ధాన్యం మొలకలు రావడాన్ని రైతులు శేసమ్మ తదితరులు చూపి ఆందోళన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుఫాన్ వల్ల ముంపుగురై రైతులు పంట నష్టపోవడం ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమే అని ఆగ్రహం వ్యక్తంచేశారు. పి.బాలబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ షబీనాకు సత్కారం

**ప్రజాశక్తి-చల్లపల్లి :** రొమేనియాలో జరుగుతున్న వరల్డ్ సబ్ జూనియర్ మరియు జూనియర్ క్లాసిక్ అండ్ ఎక్విప్ట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2023లో బంగారు పతాకాన్ని సాధించిన తెనాలికి చెందిన షబీనాను చల్లపల్లి ముస్లిం నగర్లో ఆదివారం ఘనంగా సత్కరించారు. చల్లపల్లి కి చెందిన ప్రముఖులు పఠాన్ కరిముల్లా, ఖాన్ శ్రీరామ హెల్పేర్ సొసైటీ నిర్వాకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు, ఉద్యోగ సంఘాల నాయకుడు సురేష్ లతోపాటు తదితరులు షబీనాను ఘనంగా సత్కరించారు.



షబీనాను సన్మానిస్తున్న దృశ్యం



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న బత్తుల రమేష్

## మంత్రి జోక్యంతో వికలాంగునికి ఉపాధి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బత్తుల చిన్నమ్మాయి విటిపిఎస్‌లో ఉద్యోగం చేస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె అకాలమరణం ఆ కుటుంబానికి అశానిపాతంగా మారింది. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతూ ఆ ఉద్యోగాన్ని తనకు ఇప్పించవలసినదిగా వికలాంగుడైన ఆమె కొడుకు బత్తుల రమేష్, గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఎందరో రాజకీయ నాయకులు చుట్టూ ఎందరో అధికారులు చుట్టూ ప్రదిక్షణలు చేశాడు. ఎవరూ స్పందించకపోవడంతో ఆఖరి ప్రయత్నంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ దష్టికి తన పరిస్థితి తీసుకువెళ్ళగా, వెంటనే స్పందించిన మంత్రి జోగి రమేష్ విటిపిఎస్ ఉన్నతాధికారులతో మాట్లాడి బత్తుల రమేష్ కుటుంబ నేపథ్యం వివరించి తక్షణమే క్యాజువల్ లేబర్‌గా ఉద్యోగ విధుల్లోకి తీసుకోవాలని కోరగా, మంత్రి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని ఆ సంస్థ యాజమాన్యం అతనికి ఉద్యోగం కల్పించింది. దీంతో మంత్రికి కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ నాయకులు మరియు ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న దశ్యం

## కన్నెగంటి రాజాకు గోల్డ్‌మెడల్

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ పట్టణానికి చెందిన కన్నెగంటి వెంకటేశ్వర రావు కుమారుడు కన్నెగంటి రాజాకు తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. పశు శరీర నిర్మాణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో నందిగామ పట్టణానికి చెందిన కన్నెగంటి వెంకటేశ్వరరావు మాస్టారు కుమారుడు కన్నెగంటి రాజా అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు బెస్ట్ పోస్టర్ విభాగంలో మొదటి స్థానం దక్కించుకున్నారు. అవార్డుతో పాటు గోల్డ్ మెడల్‌ను విక్రమ సింహపురి మాజీ విసి రాజా రామిరెడ్డి, మాజీ డీన్ డా.చంద్రశేఖర్ రావు చేతులమీదుగా అందజేశారు.

## శ్మశాన వాటికకు నిధుల పట్ల హర్షం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** తుమ్మలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న శ్మశాన వాటిక శంకుస్థాపన కార్యక్రమానికి తనను ఆహ్వానించక పోవడంపై జనసేన పార్టీ ఎంపిటిసి సభ్యులు పోలిశెట్టి తేజ స్పందించారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం అందక పోయినప్పటికీ తుమ్మలపాలెం ప్రజల ప్రధాన కోరిక నెరవేరిందని పోలిశెట్టి అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ అధికారులు తనను ఆహ్వానించక పోయినా తాను చేసిన పోరాటంతో హిందూ స్మశాన వాటిక నిర్మాణానికి నిధులు ప్రభుత్వం సమకూర్చటం సంతోషంగా ఉందన్నారు.



## పశ్చిమం నుంచే పోటీ చేస్తా : బుద్దా వెంకన్న

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఆడుకుందాం ఆంధ్ర అనే కార్యక్రమం మూడు సంవత్సరాల క్రితమే కొడాలి నాని ప్రారంభించి రికార్డింగ్ డాన్సులు, క్యాసినోలు నడిపారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ కొడాలి నానిని చంద్రబాబు సస్పెండ్ చేసిన తర్వాతే వైసిపికి వెళ్ళాడని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి నేనే పోటీ చేస్తానని, చంద్రబాబు మాటలను కాదని ముందుకు వెళ్లనని అన్నారు. సీటు తప్పకుండా అడుగుతానని, బీసీగా నాకు తప్పకుండా ఎమ్మెల్యే సీటు ఉంటుందనేది తన విశ్వాసం అని అన్నారు. చంద్రబాబు తనను తప్పకుండా చట్ట సభల్లోకి తీసుకెళతారని అన్నారు.



మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు, తెలుగుదేశం నాయకులు ఉమ్మడి చంటి, కొట్టేటి హనుమంతరావు, తుపాకుల వెంకటేశ్వర్లు, పేరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గాజుల అలంకరణలో తిరుపతమ్మ

**పెనుగంచిప్రోలు :** కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారు పరివార దేవతామూర్తులు ఆదివారం వివిధ రకాల రంగు రంగుల గాజుల అలంకరణలో యాత్రికులకు దర్శనమిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన కావేరి హోటల్ యజమాని కర్నాటి. వీరభద్రరావు, రమాదేవి దంపతులు, బెవరేజ్ కార్పొరేషన్ ఎండీ దొంతి రెడ్డి. వాసు దేవ రెడ్డి, కల్పన దంపతులు ఈ ప్రత్యేక అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. మైలవరం ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె.రమేష్ నాయుడు అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. కాగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ చింతల్ కు చెందిన గడ్డం. రాజేందర్ రెడ్డి, స్వాతికా రెడ్డి అమ్మవారికి 1 కేజీ వెండిని విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె.రమేష్





నాయుడుకు అందించారు. అనంతరం దాతలకు అమ్మవారి స్వామివారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. నూతన సంవత్సరం జనవరి 6 నుంచి 12వ తేదీ వరకు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మాతా మండల దీక్ష కార్యక్రమం, ఫిబ్రవరి 23న జరిగే శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవాలు కు సంబంధించిన గోడ పత్రికను ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె.రమేష్ నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎయివో తిరుమలేశా రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతో బాలుడు మృతి

**ప్రజాశక్తి - కంచికచర్ల :** ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆరుబయట ఆడుకుంటున్న పసివాని ప్రాణం బలైన సంఘటన కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కంచికచర్ల పోలీసులు అందించిన సమాచారం ప్రకారం పరిటాల గ్రామానికి చెందిన సుభాని అనే వ్యక్తి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని 18 నెలల కొడుకు అసిర్ అహమ్మద్ ఆదివారం ఉదయం ఆరున్నర గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో మంచినీళ్ళ క్యాన్లు డెలివరీ చేసే ఆటో ఆ ఇంటి సమీపంలో ఆగింది. బాలుడు అసిర్ అహమ్మద్ ఆటో ముందు భాగంలో ఆడుకుంటున్నాడు. వాటర్ క్యాన్లు డెలివరీ చేసిన



ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆడుకుంటున్న బాలుడిని గమనించకుండా ఆటోను ముందుకు పోనిచ్చాడు. దీంతో ఆటో టైర్ బాలునిపై ఎక్కింది. అచేతనంగా పడిపోయిన ఆ బాలుడిని స్థానిక వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. బాలుని పరీక్షించిన వైద్యులు అప్పటికే మతి చెందాడని ధ్రువీకరించారు. తమ కళ్లెదుటే 18 నెలల పసికందు దుర్మరణం చెందడాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఈ మేరకు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



ఇండస్ట్రీని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వసంత కృష్ణ

## ఫ్లై యాష్ బ్రిక్స్ ఇండస్ట్రీ ప్రారంభం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలంలోని కాచవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన షాజహాన్ ఫ్లైయాష్ బ్రిక్స్ ఇండస్ట్రీని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. కొటికలపూడి సొసైటీ చైర్ పర్సన్ సయ్యద్ జానీ ఈ బ్రిక్స్ కంపెనీని ఏర్పాటు చేశారు. యూనిట్, బ్రిక్స్ మేకింగ్ యంత్రాన్ని ప్రత్యేకంగా ప్రారంభించారు. ప్రజలకు సరసమైన ధరల్లో బ్రిక్స్ అందజేసి, వ్యాపారంలో మంచి పురోభివద్ధి సాధించాలని శాసనసభ్యులు కృష్ణప్రసాదు ఆకాంక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, సయ్యద్ జానీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

## దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి నరేంద్ర ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

## అక్రమార్జనే ధ్యేయంగా...

- పంచాయతీ కార్యాలయం అడ్డాగా అవినీతి
- కాంట్రాక్టర్లతో సొంత పనులు చేయించుకుంటున్న సర్పంచ్
- కార్మికుల జీతాల్లోనూ కోతలు

**ప్రజాశక్తి - మైలవరం :** ప్రజలచే ఎన్నుకోబడి ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండవలసిన ఒక సర్పంచి అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తూ అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తారని విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణ అతి తక్కువ సమయంలో 3 ఇళ్ల నిర్మాణం చేపట్టడం. పంచాయతీ కార్యాలయాన్ని తన అడ్డాగా మార్చుకుని అక్రమ సంపాదనకు తెర లేపారని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సర్పంచ్‌తో పాటు అధికార పార్టీకి చెందిన ఒక ప్రజా ప్రతినిధి, మరో ఇద్దరు వార్డు మెంబర్లు కలిసి ఒక టీంగా ఏర్పడి అడ్డదిడ్డంగా దోచుకుంటున్నారని కొందరంటున్నారు.

**కార్మికుల జీతాల్లో కోతలు**

పంచాయతీ కార్మికుల జీతాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రతినెల వారి జీతాల్లో కోతలు విధిస్తూ పర్సెంటేజీలు తీసుకుంటున్నారు. ఇదేమిటి అని అడిగితే 'అంతా మా ఇష్టం ఉంటే ఉండండి లేకపోతే లేదు మేము ఇలాగే ఇస్తాం' అని బెదిరింపులకు దిగుతున్నారు. పంచాయతీ కార్మికులు తమ బాధలను చెబుదామన్నా, ప్రజా సంఘాలు, యూనియన్ నాయకులతో మాట్లాడినా ఉద్యోగం ఊడుతుందని భయ పెడుతున్నారు. పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫామ్, కాస్మోటిక్, రక్షణ పరికరాలు మూడు సంవత్సరాల నుండి ఇవ్వకపోగా ఇచ్చినట్టుగా లెక్కలు చూపిస్తున్నారు. కనీస అనుభవం లేని ఒకరిని మేస్త్రిగా నియమించి కార్మికులను తమ సొంత అవసరాలకు ఉపయోగించు కుంటున్నారు. తమ ఇంటి నిర్మాణానికి పంచాయతీ ట్రాక్టర్‌తో మట్టి ఇసుక తోలినా అడిగే వారు లేరు.





**షాడో సర్పంచ్‌గా భర్త**

సర్పంచ్ భర్త అన్ని తానే షాడో సర్పంచ్‌గా వ్యవహరిస్తూ పంచాయతీలో చక్రం తిప్పుతున్నారు. పంచాయతీకి సంబంధించిన టెండర్ కాంట్రాక్టు వర్కులు టెండర్లు లేకుండానే వేరొకరి పేరుపై తీసుకొని ఆ పనులకు పంచాయతీ కార్మికులని ఉపయోగిస్తున్నారు. పూరగుట్ట, అయ్యప్ప నగర్‌లో అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేశారు. స్థోమత లేని వాళ్ళు ఇంటి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్లాట్లు రద్దు అవుతాయని చెప్పి అతి తక్కువ ధరకు వారి నుండి కొనుగోలు చేసి మరొకరికి విక్రయించి లక్షలాది రూపాయలు అక్రమార్చనకు తెర లేపారు. ఇక్కడ వార్డు మెంబర్ల సహాయంతో. అసలు పట్టాకు నకిలీ పట్టాలు సష్టించి ప్లాట్లు ఆక్రమించుకొని దందాలు నడుపుతున్నారు. ఈ విధంగా వీరి ఆగడాలకు అంతులేకుండా పోయింది. అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న విరిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**వేధింపులకు గురి చేయటం సరికాదు : ఎర్రం శెట్టి వీరమ్మ**



అయ్యప్ప నగర్‌లో ప్రైవేట్ పైపులైన్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

**పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి**

20 సంవత్సరాలు నుండి పనిచేస్తున్న కార్మికులను పట్టించుకోకుండా ఎవరు అధికారంలోకి వస్తే వారు తమకు అనుకూలమైన వారిని నియమించటం తగదు. కార్మికులకు ఇవ్వవలసిన కాస్మోటిక్స్, యూనిఫామ్, సబ్బులు తదితర వస్తువులను అడిగితే అడిగిన వారి పై బెదిరింపులకు దిగటం సరికాదు. టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ సమానంగా చూడాలి.

**అవినీతిని నిర్మూలించాలి : సిహెచ్ సుధాకర్ సిఐటియు మండల కార్యదర్శి**



ఎన్నోఏళ్లుగా పంచాయతీ కార్మికులను పాలకవర్గాల వారు చిన్న చూపు చూస్తున్నారు. పంచాయతీ కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు ఇవ్వాలి. కార్మికులకు రక్షణ కల్పించాలి. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతికే అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాలి.

# భయం గుప్పిట్లో విఎన్ పురం



- గంజాయి బ్యాచ్ హల్‌చల్
- పెరుగుతున్న దొంగతనాలు

ప్రజాశక్తి-గన్నవరం : విచ్చలవిడిగా గంజాయి తాగుతున్న యువకులు...అవసరాల కోసం దొంగతనాలు.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం గుప్పెట్లో జనాలు.. ఇది గత కొద్ది రోజులుగా కేసరపల్లి శివారు వెంకట నరసింహపురంలో చోటుచేసుకున్న పరిక్షితి. రాత్రి వేళలో గంజాయి బాబులు, చిల్లర దొంగలు ఇళ్లలో గోడలు దూకి దొంగతనాలకు పాల్పడటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు స్థానికులు. ఈ కాలనీలో 2000 మంది జనాభా నివసిస్తున్నారు. పేద మధ్యతరగతి వారితోపాటు ఉద్యోగస్తులు ఉంటున్నారు. కొంతమంది యువకులు గంజాయికి అలవాటు పడ్డారు. వైజాగ్ విజయవాడ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి కొంతమంది రహస్యంగా యువకులకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. బాగా మత్తు కావలసిన యువకులు ఈ గంజాయి సేవిస్తున్నారు. పగలు ఏదో ఒక పనులు చేసి వచ్చిన డబ్బులతో గంజాయి సిగరెట్లను కొనుక్కొని తాగి మత్తులో మునిగి తేలుతున్నారని మహిళలు చెబుతున్నారు. డబ్బులు లేకుంటే రాత్రి వేళలో ఇళ్లల్లో చొరబడి సైకిల్ స్కూటర్లు ఎత్తుకుపోతున్నారని, ఎవరైనా అడ్డగిస్తే మత్తులో వారిపై దాడులకు తెగబడుతున్నారని మహిళలు వాపోతున్నారు. మహిళల మెడలో బంగారు గొలుసులు కూడా తెంచుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. రాత్రి వేళలో నీళ్లలో దొంగతనాలు జరగడంతో జనానికి కంటిమీద కొనుక్కు కరువు అవుతుంది. ఎవరైనా ఊరు వెళుతూ ఇంటికి తాళం వేస్తే వచ్చేసరికి ఇల్లు ఖాళీ అవుతుందని అంటున్నారు. ముఖ్యంగా సైకిళ్ళు స్కూటర్లు ఎత్తుకుపోతున్నారు. ఇళ్లలో విద్యుత్ మోటార్లు కూడా పీక్కుపోయే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. దీనంతటికీ కారణం మందు బాబులు చిల్లర దొంగలేనని పేర్కొంటున్నారు. కొంత మంది బయట ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు గంజాయి, మద్యానికి బానిసలై ఇష్టానుసారంగా ఇళ్లను కొల్లగొట్టేస్తున్నారని కొంతమంది చెప్పారు. పోలీసులు రాత్రి వేళలో గస్తీ తిరుగుతున్న వీరిని పట్టుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ గంజాయి బాబుల నుంచి తమను రక్షించాలని వేడుకుంటున్నారు. ముఖ్యంగా ఈ గంజాయి కి అలవాటు పడిన యువకులు 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వారే కావడం గమనార్హం.



### దొంగతనాలు పెరిగాయి : గోవర్ధన రెడ్డి



గంజాయి తాగిఅర్ధరాత్రి వేళ ఇళ్ళల్లోకు చొరబడి కొందరు యువ కులు దొంగతనాలకు పాల్పడు తున్నారు. తాను డ్యూటీకి వెళ్లి పది రోజుల తర్వాత తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద బయటపెట్టిన సామాన్లు మొత్తం ఎత్తుకు పోయారు. ఇళ్లలో ఆడవాళ్లు ఒంటరిగా ఉండేందుకు భయాందోళన చెందుతున్నారు.

### భయబ్రాంతులకు గురవుతున్నాం : మేరీ



ఒంటరిగా ఉన్న మహిళల ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడు తున్నారు. ఎవరైనా అడ్డగిస్తే వారి మీద దాడికి తెగబడుతున్నారు. గంజాయి మత్తులో ఇష్టం వచ్చినట్లుగా బ్లెడ్ లతో స్వైర విహారం చేస్తున్నారు. వీరిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని పోలీసులకు చెప్పినఫలితం లేదు.

### ఇప్పటికైనా స్పందించాలి : సుగుణమ్మ



కాలనీలో గంజాయి బ్యాచ్‌ని నియంత్రించడానికి పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి. రాత్రి వేళలో మహిళలు బయటకు రావాలంటే భయం వేస్తుంది. తాగిన మైకంలో ఏం చేస్తారు తెలియ డం లేదు. ఈ కాలంలోగంజాయి అమ్మ కాలు పెరిగాయి. గంజాయి తాగిన వారిని ఆపలేని పరిస్థితి ఉంది.



## పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం చిరివెళ్ళపాలెం గ్రామంలో వైసీపీ పార్టీ గ్రామ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ సభ్యులు పేరుబోయిన నాంచారయ్య మరో 15 కుటుంబాలు వైసీపీ పార్టీ విడిచి తెలుగుదేశం పార్టీలో చేరారు. మచిలీపట్నం నియోజ కవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీమంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో వీరంతా పార్టీ కండు వాకప్పుకున్నారు. ఈ సందర్భంగా పేరుబోయిన నాంచారయ్య మాట్లాడుతూ కొల్లు రవీంద్ర తోనే బందరు అభివృద్ధి సాధ్యం అని మేమంతా నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరామన్నారు. నాయకులు గొర్రెపాటి గోపీచంద్,గోపుసత్యం, లంకే నారాయణ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కుంచె నానీ, సర్పంచ్ సిరివెళ్ల సాంబయ్య, క్లస్టర్ ఇంచార్జిలు లంకే శేషగిరి తదితరులు హాజరయ్యారు.

## రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో బంటుమిల్లి మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. మండలం లో మలపరాజుగూడెంలో పూర్తిగా నీటి మునిగిన వరిచేలను రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వరిపనలు వర్షానికి పూర్తిగా మునిగిపో యాయని, వర్షం తగ్గి ఐదు రోజులైనా ఇప్పటివరకు పొలం దగ్గరికి అధికారులు ఎవరూ రాలేదని, పంటనష్టం అంచనాలు పరిశీలించలేదన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంతోపాటు ఉచితంగా విత్త నాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమం లో మండల రైతు సంఘ కార్యదర్శి లంక దాసుల అజయ్ ఘోష్, దుసన పూడి పరంధామయ్య, దుసనపూడి రామారావు, కష్ణ, కసిట్టి వెంకటరావు, శ్రీనివాసరావు, గుడిసె తాతబాబు తదితరులు పాల్గొన్నారు.



పంటలు పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

## రామచంద్రరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి సామర్ల రామచంద్రరావు( రాముడు) జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో రాముడు చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



పమిడిముక్కలలో దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేదలకు సహాయం చేయడంలో షేరింగ్ అండ్ కేరింగ్ సంస్థ ముందుం టుందని ఇంటర్నేషనల్ బ్రాహ్మణి పార్లమెంట్ రాష్ట్ర అధ్యక్షులు దినవాహి ప్రసాద్ అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని లంకపల్లి గ్రామంలో ఎస్టీ కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంకపల్లి అభివద్ధికి కష్టపడుతున్న సర్పంచ్ వేమూరి రత్నకుమారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో పేదలకు సహాయం చేయాలని ఆయన అన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాలు ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి మాజీ సర్పంచ్ కనుమూరు వెంకటేశ్వరరావు, సేలం రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-చల్లపల్లి : గుంటూ రు కేంద్రంగా బహుజనులక అభివద్ధి కోసం కృషి చేస్తున్న బహుజన మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం చల్లపల్లిలో యానాదులకు ఆదివారం విశ్రాంత విద్యుత్ జనరల్ మేనేజర్ కే భాస్కర్, దాతల సౌజన్యంతో బోగిన సంఘం కార్యదర్శి కే భగత్ సింగ్ ఆధ్వర్యంలో బియ్యం, దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేసారు. చిన్నారుకు బిస్కట్ పాకెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాజకసంఘ ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త విజయ కుమారి,కైతేపల్లి దాస్ పాల్గొన్నారు

## నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన నిర్వహిస్తారని,ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ సూచించారు.

## పెండిగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్రంలో 25 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం , అలాగే కె జి బి వి విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఎన్ దేవేంద్ర రావు డిమాండ్ చేశారు. వీరికి చెల్లించే అరకొర వేతనాలు సక్రమంగా చెల్లించకుండా మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవటం వలన కుటుంబాలు పస్తులు ఉండటం. జరుగుతుందని ఇప్పటి వరకు అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకొస్తున్నమన్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించక పోవడం వల్ల ప్రతి నెల చెల్లించాల్సిన ఇంటి అద్దె , నిత్యావసర సరుకులు, రవాణా చార్జీలు, ఇఎంఐలు కట్టలేక "మానసిక వేతనంతో ఉద్యోగులు నలిగిపోతున్నరన్నారు. కాబట్టి తక్షణమే పెండింగ్ లో ఉన్న సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



## పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- డిసిఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ

ప్రజాశక్తి-ఉయ్యూరు : పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని డీసీఎంఎస్ చైర్ పర్సన్, రక్షా ఫౌండేషన్ చైర్పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని పెద్ద ఓగిరాల గ్రామంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న గుంటక అప్పిరెడ్డి , కాటూరి రంగయ్య, జి సాంబయ్య, పిట్ట సోమయ్యలకు రక్ష ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి 5000 చొప్పున ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు గుంటక నాగిరెడ్డి సర్పంచ్ త్రిపురం లక్ష్మీ వైఎస్ఆర్పిపి నేత త్రిపురం చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్ పర్సన్ స్నిగ్ధ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలు కార్పొరేటర్ వైద్యం ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గుంటక భాస్కర్ రెడ్డి, ఉంగ్రా సుదీపిక, వి వీరస్వామి, ఏ అక్బర్, వీరంకి వెంకటేశ్వరరావు, జి సుబ్బారావు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష బిల్వార్చన

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: కార్తీకమాసం పురస్కరించుకుని బాపులపాడు మండలం వీరవల్లీ గ్రామంలో కొలువైన శ్రీ గంగా పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవస్థానంలో వేద పండితులు వేద మంత్రాల నడుమ నిర్వహించిన లక్ష బిల్వార్చన అధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. ఉదయం నుంచి దేవస్థానంలో అర్చకుడు కుందుర్తి మురళీ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు గణపతి పూజా, పంచకవ్యప్రాసన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బండి భాస్కర్ దంపతులు, లంక రవిశ్రీనివాస్ శ్రీలక్ష్మీ దంపతులు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో స్పందన

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పది గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

## మొదటిపేజీ తరువాయి

### విత్తన వెతలు

క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరం. వ్యవసాయ శాఖ వద్ద రైతులకు అవసరమైన మొత్తంలో మినుము విత్తనాలు అందుబాటులో లేవు. తుపానుకు ముందు విత్తనాలు జల్లి నష్టపోయిన రైతులకు అవసరమైన 8 వేల క్వింటాళ్లు మాత్రమే రాయితీపై ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో అత్యధిక సంఖ్యలో రైతులు వ్యాపారులు చెప్పిన ధరకే మినుములు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అప్పుడు రూ.7,700... ఇప్పుడు రూ.15 వేలు**

నవంబర్ మూడు, నాలుగు వారాలు, డిసెంబర్ మొదటి, రెండు వారాల మధ్యలో వరి మాగాణుల్లో మినుము సాగు చేపడతారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి 15వ తేదీ మధ్య పంట దిగుబడులు వస్తాయి. గతేడాది ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు క్వింటా మినుములు రూ.7,700కు రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతుల వద్ద కొన్న మినుముల్లోనే నాణ్యత కలిగిన వాటిని విత్తనాలకు విక్రయిస్తున్నారు. తాజాగా రైతులు అమ్మిన ధరకు రెట్టింపుకు క్వింటా రూ.15 వేలకు అమ్ముతున్నారు.

**మినుము విత్తనాలు క్వింటా రూ.15 వేలు**

**పామర్తి శ్రీనివాసరావు, రైతు, వీరాయలంక, మొవ్వ మండలం**

తుపానుకు ముందు నాకున్న రెండున్నర ఎకరాల్లో మినుము విత్తనాలు జల్లి కోత కోశాను. అప్పుడు క్వింటా రూ.10,500కు కొన్నా. తుపానుకు మొత్తం మునిగిపోయింది. తిరిగి మళ్లీ క్వింటా రూ.15 వేలకు కొన్నా.

### 2041 నాటికి పెరగనున్న జనాభా

అధికంగానే ఉంది. ఒక చదరపు కిమీ పరిధిలో 17329 మంది నివసిస్తున్నారు. ఇదిలా ఉంటే 2031 నాటికి విఎంసి జనాభా 18,86,387 వరకు, 2041 నాటికి 25,47,480 వరకు పెరిగే అవకాశం ఉందని ఐయుసి బేస్‌లైన్ స్టడీ ప్రకారం అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే గత శతాబ్ద కాలం నాటి జనాభాలో కూడా పెరుగుదల బాగానే కనిపిస్తుంది. అంటే 1901 నుంచి 2011 వరకు పెద్ద ఎత్తున జనాభా పెరిగింది. 1901లో 24 వేలు ఉన్న జనాభా 2011 నాటికి 10.38 లక్షల వరకు చేరుకుంది. అంటే 110 ఏళ్లల్లో 10.10 లక్షలకు పైగా పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 2001 - 2011 విఎంసి జనాభా 9.83 శాతం పెరగగా, 2011-2021 నాటికి 8 శాతం పెరిగింది.

### ఆహార పదార్థాల కల్తీపై నిఘా

తీసుకొని క్వాలిటీని గుర్తించడం జరుగుతుంది. స్టాండెడ్, సబ్‌స్టాండెడ్‌గా పరిగణించాల్సి ఉంటుంది.

**ప్రశ్న :** ఎక్కువుగా ఎటువంటి కేసులు నమోదవుతుంటాయి?

సాధారణంగా మిస్ బ్రాండింగ్ (ప్యాకింగ్) లేబుల్ మీద బ్యాచ్ నెంబర్, తూకం, ధర, తయారీ డేట్, ఎక్స్‌పైయిరీడేట్ తదితర వీటి విషయంలో లోపాలు జరుగుతుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆయిల్స్‌లో కల్తీలు చోటు చేసుకోవచ్చు. రోజు వారీగా ఇటువంటి కేసులను పరిశీలించడం, నమోదు చేయడం జరుగుతుంటుంది. సబ్‌స్టాండెడ్ మీద కేసులు ఎక్కువుగా ఉంటాయి. ఎడిబుల్ ఆయిల్స్, పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, శనగనూనె ఇటువంటి వాటిల్లో కల్తీలు చోటు చేసుకుంటాయి. ఇతర తినుబండారాల్లో కూడా జరుగుతుంటుంది.

**ప్రశ్న :** జరిమానాలు ఏ స్థాయిలో విధిస్తుంటారు?

కల్తీ ఆధారంగా కేసు నమోదు చేయడం, అదే స్థాయిలో జరిమానాలు విధిస్తాం. కొన్ని కేసుల్లో లక్షల్లోనే జరిమానా ఉండవచ్చు.

**ప్రశ్న :** మీ కార్యాలయం పరిధిలో ఎన్ని పోస్టులుండాలి, ప్రస్తుతం ఎంత మంది ఇనిస్పెక్టర్లు పని చేస్తున్నారు?

కార్యాలయ విస్తృతి స్థాయిని బట్టి సుమారు పది మంది వరకు ఫుడ్ ఇనిస్పెక్టర్లు ఉండాలి. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. ఉన్న వారిపై కూడా నిరంతరం పని భారం పెరిగిపోయి, పర్యవేక్షించడం సాధ్యం కాని పరిస్థితి. నిరంతరం నగరం, మునిసిపల్ స్థాయిల్లో కోర్టు కేసులు చుట్టూ తిరగాల్సి ఉంటుంది. సిబ్బందిని పెంచాల్సి ఉంది. కార్యాలయం కూడా ఇరుకుగానే ఉంది.

# రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ

- తెగుళ్లు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన
- నూజివీడు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి



పండ్లలో రారాజైన మామిడి ప్రపంచంలోనే అత్యధికంగా ఏటా 25 మిలియన్ టన్నులు భారతదేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయి... అయితే ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, చీడపీడలు, సాగునీటి సౌకర్యాలు, మార్కెట్లో ధరలు వంటి కారణాలతో మామిడి సాగు ఏటేటా తగ్గిపోతూ వస్తోంది... ఈ క్రమంలో ఏలూరుజిల్లా నూజివీడులోని డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యు ఆధ్వర్యంలోని మామిడి పరిశోధనా స్థానం ఏటా తన పరిశోధనా పరిధిని విస్తృతి చేసుకుంటూ రైతులకు మామిడి పంటను కాపాడుకునే సస్యరక్షణ చర్యలను తెలియజేస్తోంది. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ రానుందని, తోటలను ఎవరూ నరికేయవద్దని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ సందర్భంగా పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ బొర్రా కనకమహాలక్ష్మి పలు విషయాలను 'ప్రజాశక్తి'కి వివరించారు.

**ప్రశ్న :** మామిడి సాగుపై ఎలాంటి పరిశోధనలు జరుగుతున్నాయి?

మామిడిలో అధిక సాంద్రతతో మొక్కలను వేసి ఉత్పత్తి పెంపుదల, చీడ పీడల నివారణ, విదేశీ ఎగుమతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా అనేక అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మామిడి అభివృద్ధికి, అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, ప్రూనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం, నీటి యాజమాన్య పద్ధతులను వివరించటం, కోతలు పూర్తయిన తర్వాత తోటల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి రైతాంగానికి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి తెలియజేస్తున్నాం. మామిడి సాగున్న అన్ని ప్రాంతాలకు మా పరిశోధనా ఫలితాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రశ్న :** మామిడికి ఎలాంటి వాతావరణం అనుకూలం?

మామిడికి ప్రధానంగా రాత్రిపూట చలి వాతావరణం, పగలు వేడి వాతావరణం ఉన్నప్పుడు మొగ్గలు వస్తాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మామిడి పూతలు ఉధృతంగా రావటానికి అవకాశం ఉంది. నూజివీడు, విస్సన్నపేట, చాట్రాయి మండలాల్లో కొన్ని చోట్ల ముదురుకాపులు వచ్చాయి. మామిడి సాగులో పూత దశ నుంచి కోత దశ వరకు రైతాంగం తీసుకోవాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. వర్షాలు పడి ఆగగానే మామిడికి తేనేమంచు, తామర పురుగులు, పక్షికన్ను తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీటి నివారణకు తక్షణమే ఇమిడిక్లోరిట్ 0.3 మి.లీ.గ్రాములు లేదా థ్రోమిథాక్సిమ్ 0.5 గ్రాములు, సిలింద్రనాశినిలైన కార్బన్‌డిజమ్ 1 గ్రాము లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు, జిగురు 0.5 మిల్లీ గ్రాములు కలిపి పిచికారీ చేయించాలి.

**ప్రశ్న :** తెగుళ్ల నివారణా ఏ పద్ధతులను పాటించాలి?

తేనేమంచు, తామర, చెదల పురుగు, తెగుళ్లలో పక్షికన్ను తెగులు, బూడిద, నల్లమచ్చ తెగులు ముఖ్యమైనవి. తేనే మంచు పురుగు పూత, లేత చిగుళ్ల నుంచి రసం పీల్చడంతో పూత రాలిపోయే ప్రమాదం ఉంది. ఈ పురుగులు విసర్జించిన జిగురుపై మసి తెగులు వృద్ధి చెందుతుంది. నల్లతామరతో పాటు ఇతర, పురుగులు, తెగుళ్ల నివారణా చర్యలపై పెద్దఎత్తున రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి సలహాలు, సూచనలు అందిస్తున్నాం. మంచు పెరిగే కొద్దీ మామిడి పిందెలు, కాయలకు మంగు, దోమపోటు, ఇతర మచ్చలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల మా వంతుగా కాయల రక్షణ కోసం కవర్లు వాడమని చెబుతున్నాం. వీటిని పిందె దశలోనే తొడిగితే కాయ నాణ్యతగా ఉండి మార్కెట్లో అధిక ధర లభిస్తుంది.

**ప్రశ్న :** టాప్ వర్కింగ్ పద్ధతులు ఎలా పాటిస్తారు?

నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలోని క్షేత్రంలో ఎక్కువ వయసున్న ముదురు చెట్లను మొదలు నుంచి పైవరకు నరికి తొలగించి టాప్ వర్కింగ్ పద్ధతిలో పూర్తిగా వాటినే పునరుద్ధరిస్తున్నాం. దీనిలో భాగంగా చెట్టును ఆరడుగుల ఎత్తు వరకు తొలగించి అక్కడి నుంచి కావాల్సిన రకాన్ని అంటు కట్టి పునరుద్ధరిస్తున్నాం. ఇలా చేయటం వల్ల రెండేళ్లకే దిగుబడి ప్రారంభమవుతుంది. అలాగే అధిక, పాక్షిక సాంద్ర పద్ధతుల్లో రైతులతో మొక్కలు నాటించి వాటిలో ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ముదురుతోటలు ఉన్న రైతులతో కూడా మాట్లాడి పునరుద్ధరణ చర్యలను ప్రోత్సహిస్తున్నాం. ఒకే మామిడి చెట్టుకు అనేక రకాల కాయలు కాసేలా చేసే అంట్లను తయారు చేయిస్తున్నాం.

**ప్రశ్న :** లింగాకర్షణ బుట్టలతో మేలు జరుగుతుందా?

మామిడికి ఆశించే పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టను రూపొందించి రాష్ట్రంలోని మామిడి రైతులకు ఇక్కడి నుంచే అందించే ఏర్పాట్లు కొనసాగిస్తున్నాం. ప్రతికూల వాతావరణం వల్ల తోటల్లో వచ్చే మార్పులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఒక ఏడాది కాస్తే మరో ఏడాది కాయకపోవటం మామిడి సాధారణ లక్షణం. గతేడాది మామిడి కాపు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది కాపు ఎక్కువగా ఉంచొచ్చునని ఇప్పుడున్న పరిస్థితిని బట్టి రైతులు భావిస్తున్నారు. నూజివీడు ప్రాంతంలోని బంగినపల్లి, తోతాపురి, చిన్న, పెద్ద రసాలు, చెరకు రసం వంటి మామిడి తోటల్లో పూత ప్రస్తుతం ఉధృతంగా కనిపిస్తుంది. ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకూ పూతలు వచ్చాయి. మిగతా భాగం ఇప్పటి నుంచి వస్తుంది.

**ప్రశ్న :** నాణ్యమైన పంట దిగుబడులు రావాలంటే ఏమి చేయాలి?

నూజివీడు మండలం సిద్ధార్‌నగర్ ప్రాంతంలో 26 ఎకరాల్లో రూ.275 కోట్లతో మ్యాంగో పల్ప్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ట్రాప్స్, లూర్స్ వినియోగంపైన రైతులకు తెలియజేస్తున్నాం. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ రానుంది. తోటలను ఎవరూ నరకేయొద్దు. తెల్లపూత సమయంలో రసాయన మందులు పిచికారీ చేయొద్దు. పొటాషియం, నైట్రేట్, జింక్, బోరాన్, మాంగనీస్‌లను పిచికారీ చేసుకోవాలి. దీని వల్ల చెట్టు ఆరోగ్యంగా ఉంటుంది. కాయల నాణ్యత అధికం అవుతుంది. తేనేమంచు పురుగు, తామర పురుగుల ఉధృతిని బట్టి రసాయన మందుల పిచికారీ చేయాలి.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




ప్రజాశక్తి-విజయవాడ

ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ పరిపాలనా విభాగం సిబ్బంది వారి కుటుంబ సభ్యులు కలిసి విజయవాడ రూరల్ వికాస్ కళాశాల సమీపంలోని సామ్రాజ్య రిసార్ట్స్‌లో కార్తీక వన సమారాధన వేడుకలు ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణాటాటా పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారుల భరతనాట్యం, ఆట-పాటలు, తదితర వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో విచ్చేసిన వారిని అలరించి, విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు మ్యూజికల్ చైర్స్ వంటి పలు ఆటల పోటీలను నిర్వహించారు. ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి నగర పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ.... కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని బాగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సి.పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి అజిత వేజెండ్ల, సి.ఎస్.డబ్ల్యు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయరాణి , అడ్మిన్ డి.సి.పి. మోకా సత్తిబాబు, ఇన్ ఛార్జ్ నార్త్ ఏ.సి.పి. సి.హెచ్. శ్రీనివాసరావు , ఏ.ఓ. రంగారావు , పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# నీటిలోనే నానుతున్న వరి పనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మునిగిన పొలాలనుండి ఇప్పటివరకు నీరు తగ్గకపోవడంతో వరిపనలు, వరిపంట మురిగి పోతున్న పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు తగ్గి నాలుగురోజులు దాటినా మండల పరిధి పలుగ్రామాల పొలాల్లో ఇంతవరకు నీరుబటయకు పోక కొన్నిచోట్ల ధాన్యంనుండి మొలకలు, మరి కొన్ని ప్రాంతాల్లో కోతకోసేందుకు వీలులేకుండా పంట నీటిలో మునిగి ఉంది. మదునూరు, బొళ్లపాడు, కాటూరు, కడవకొల్లులో పొలాల్లో నీటిలో ఉన్న వరిపనలు మ ఎరిగి పోయి పనికి రాకుండా పోతుంది. ఆరుగాలం కష్టపడి వేల రూపాయలు ఖర్చుచేసి పండించిన పంట చేతికొ స్తున్న తరుణంలో తుఫాను తీవ్రనష్టం కలుగజేసిందని, ప్రభుత్వం ధాన్యంమంతా కొనుగోలుచేసి ఆదుకోపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# కుళ్లిపోతున్న వరి.. ఆందోళనలో రైతులు





**ప్రజాశక్తి-గన్నవరం :** తుఫానుతో కురిసిన వర్షాలతో మునిగిపోయిన వరి పొలాల్లో పైరు కుళ్ళి పోతుంది. అదిచూసి రైతులు కుమిలిపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి దాయనీయంగా ఉంది. అదివారం నాటికి కూడా ముంపు నుంచి కోలుకోలేదు. వర్షాలు తగ్గి నాలుగు రోజులు అవుతున్నా బూతి మిల్లిపాడు, తరీగొప్పుల, అజ్జంపూడిలలో దరిదాపు వెయ్యి ఎకరాల పొలం మోకాళ్ళ లోతు నీటిలోనే కొట్టుమిట్టులాడుతు న్నాయి. పల్లపు ప్రాంతాలలో ఉన్న డ్రైను, పంట బోదులు పూడిపోవడంతో వర్షం ఆగిపోయి 96 గంటలు దాటినానీరు నిలవ ఉండటంతో వరి పంట కుళ్ళిపోయి దుర్వాసన వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలోసాగు చేసిన ఎం .టి. యు 13 18, ఎం. టి.యు.వరి కంకులు మొలక వచ్చింది. దీనితో వేల రూపాయలు వెచ్చించి సాగుచేసిన రైతులు, కౌలు రైతులు దెబ్బతిన్న పంటను ఏమి చేయాలో తెలియక సతమతమవు తున్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, మంత్రులు, పామర్రు నియోజకవర్గ శాసన సభ్యులు వంశీ తో సహా అందరూపంట దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని చేస్తున్న నం ప్రకటనలు ప్రచారానికే పరిమితమైనాయని, పంట నష్టం అంచనాలు వేయటానికి వ్యవసాయ అధికారులు ముందుకే రావటం లేదని వాపోతున్నారు. ఏ విధమైన జీవోలు రాలేదనే కుంటి సాకుతో తమను ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికికూడా ప్రజా ప్రతినిధులు ముంపు పాలైన వరి పొలాలను చూడటానికి రాలేదంటే వారికి రైతుల పట్ల, వ్యవసాయం పట్ల ఉన్న సవతి తల్లిప్రేమ వెల్లడవుతోందని ఆ ప్రాంతంలోని రైతులు, కౌలు రైతులైన వెంకటేశ్వరావు, రాంబాబు, ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దావాజీగూడెం, అల్లాపురం సావరగూడెం, జక్కుల నెక్కలం, అప్పారావుపేట ఏరియాలో నీటిలో ఉన్న వరి పంటను కాపాడేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కౌలుదారుల చేతికి పంట వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కౌలు 16 బస్తాలు, ఇవ్వడానికి కూడా అవకాశం లేదని వాపోతున్నారు. ఎకరానికి 25 వేల రూపాయలు అప్పుచేసి పెట్టామని, చేతికి వచ్చే పరిస్థితి లేదని కౌలు రైతు జోసెఫ్ కంటతడి పెట్టారు. ప్రభుత్వం ఆదుకుని ఎకరానికి 20వేల రూపాయల సహాయం చేస్తే కొంతవరకు బయట పడతామని అంటున్నారు. ఏదేమైనా ఈ ఏడాది కౌలు రైతుకు కష్టాలు, కన్నీళ్లు మిగిలాయని ప్రతి ఒక్కరూ కుమిలిపోతున్నారు.




## ఎంపిటిసి దంపతులకు అభినందనలు

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** వేకునూరు తుంగలవారిపాలెం ఎంపీటీసీ సభ్యులు వర్రే నరేష్‌బాబు వివాహం ఈ నెల ఏడో తేదీన తిరుపతిలో జరగగా ఆదివారం నాగాయలంక లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రిసెప్షన్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు లు పాల్గొని నరేష్ బాబు దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నాగాయలంక, అవనిగడ్డ, జడ్పిటిసిలు మోకా బుచ్చిబాబు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, పార్టీ యువ నాయకులు సింహాద్రి వికాస్ బాబు, అవనిగడ్డ నాగాయలంక మండల పార్టీ కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, భోగాది శేషగిరిరావు, స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్న స్టేట్ ఐటీ వింగ్ దోవారి పూర్ణ సాగర్, అధికారులు పాల్గొని నరేష్ దంపతులను ఆశీర్వదించారు.

# పలుచోట్ల కార్తీక వనసమారాదనలు

**ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీ పట్నంలోని స్థానిక గాంధీ విద్యాలయంలో ఆదివారం ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాదన జరిగింది. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఆర్యవైశ్య ఐక్య ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే మచిలీపట్నం లోని స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆదివారం యాదవ కార్తీక వనస మారాదన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ, యాదవ సంఘం నాయకులు పల్లపాటిచినబాబు,శేకు బోయిన సుబ్రమణ్యం, ధర్మరాజు, నాగేశ్వరరావు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, యాదవ సామాజిక వర్గ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఆర్యవైశ్యులు సేవా భావం కలిగిన వారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం తాళ్లూరి కళ్యాణ మంటపంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కష్ణాజిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార మహెూత్సవం, కార్తీక వన సమారాధనకు వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గానికి వెనిగండ్ల శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి సేవ చేయటంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని రాము కొనియాడారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, కష్ణజిల్లా అధ్యక్షులు ఎక్కలి మణిదీప్, నూతన కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద దివి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు తిమ్మన సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు న్యాయవాదులు, ఉపాధ్యాయులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అదే విధంగా పాత యడ్ల లంక సమీపంలోని మామిడి తోటలో చైల్డ్హుడ్ సమస్తకు చెందిన వారు నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో చైల్డ్ హుడ్ సభ్యులు తోపాటు పలువురు పాత్రికేయులు కూడా పాల్గొని సందడి చేశారు. సమస్త అధ్యక్షులు మతి శ్రీనివాసరావుతో పాటు సభ్యులు అలపర్తి గోపాలకష్ణ, సామర్ల మల్లి అన్నపరెడ్డి కష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో వెనిగండ్ల రామును సన్మానిస్తున్న దృశ్యం

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంకిపాడులో...



గన్నవరంలో...

**ప్రజాశక్తి-కంకిపాడు :** దేవినేని ఆర్మీ లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో కష్ణాజిల్లా, కంకిపాడు మండలం,ఈడుపుగల్లు గ్రామంలో 121వ ఉచిత మెగా వైద్య శిబిరంను గ్రామంలోని ఎంబిఎంఆర్ కాలనీ లక్ష్మి వినీత ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మాజీ ఎంపీపీ దేవినేని రాజా, గ్రామ సర్పంచ్ పందిపాటి ఇందిర పాల్గొని ఈ వైద్య శిబిరంను ప్రారంచారు. ఈ శిబిరంలో 120మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని. రామకష్ణారావు, రావి. సత్యనారాయణ, ఆలపాటి. వెంకటేశ్వరరావు, గోరంట్ల. కష్ణారావు, దేవినేని.బోస్, వల్లభనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం లోని ప్రముఖ దంత వైద్యశాల లక్షమ్మ స్మైల్ ఎన్ షైన్ మరియు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చింతలపేట లోని చర్చ్ ఆఫ్ ది లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ మందిరంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో డా. కె.సంపత్ కుమార్ రాజు మరియు డా .ఎన్.శ్రావ్య చందనలు సభ్యులకు దంత పరీక్షలు చేసి టూత్ పేస్టులు, మందులు పంపిణీ చేశారు. సంఘ కాపరి పాస్టర్ ఎన్.జోసెఫ్ రాజు, గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిప్పాడా చంద్రశేఖర్, సంఘ పెద్దలు దేవరపల్లి విక్టర్ బాబు, లాజరూ, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సాత్విక

## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

**ప్రజాశక్తి - కంచికచర్ల :** గ్రామాల అభివద్ధికి సర్పంచులు చేసే పోరాటానికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పూర్తిగా సహకరించాలని 'గ్రామాల అభివద్ధికై సర్పంచ్‌ల సమర శంఖారావం' సమావేశం విజ్ఞప్తి చేసింది. కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామంలో నందిగామ నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ మన్నె సాత్విక అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగిన సమర శంఖారావంలో ఉమ్మడి కష్ణా జిల్లాల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గోలి వసంత్ కుమార్ మాట్లాడుతూ సర్పంచుల న్యాయ సమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచా యతీలకు ప్రభుత్వం నుండి రావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులు చేసే పోరాటానికి ప్రతి ఒక్కరూ పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధికార ప్రతినిధి గల్లా తిమోతీ, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : గద్దె


**ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ :** ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్రెడ్డి నాలుగున్నరేళ్ళ పాలనలో రాష్ట్ర అన్ని రంగాల్లో వెనుకబడిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రాన్ని అభివద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. ఆదివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 10వ డివిజన్ కె.పి నగర్లో బుబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని డివిజన్లోని ప్రతి ఇంటికి వెళ్ళి వైఎస్. జగన్మోహన్రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాల వల్ల వారు పడుతున్న కష్టాలను అడిగి తెల్సుకున్నారు. కె.పి.నగర్ లో జరిగిన ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో గద్దె రామమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి రాష్ట్రంలో అభివద్ధి నిలిచి పోయిందన్నారు. ఏ ఒక్క రంగంలో కూడా అభివద్ధి అనేది కనిపించడం లేదన్నారు. ఇసుక లేకపోవడంతో నిర్మాణం రంగం కుదేలు అయ్యిందని చెప్పారు. నిర్మాణం రంగంలో పనులు లేకపోవడంతో సిమెంట్, ఇటుక, స్టీలు విక్రయాలు లేవని దీనివల్ల నిర్మాణ రంగంపై ఆధారపడిన వారికి జీవనోపాధి లేదన్నారు. అమరావతి రాజధాని తరలింపు వ్యవహారంతో అమరావతి పరిధిలోని ఆటో డ్రైవర్లకు కిరాయిలు లేవని, దీనివల్ల పచారి దుకాణాల్లో వ్యాపారాలు లేవని, నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు ఇవ్వబడును అనే బోర్డులు దర్శనమిస్తున్నాయని అన్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ మాట్లాడుతూ డివిజన్లో లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. దొంగ ఒట్లతోనైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని వైఎస్సార్సీపీ నాయకులు చూస్తున్నారని, ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను గుర్తిస్తే వెంటనే తమ దష్టికి తీసుకురావాల్సిందిగా ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సుంకర వీరభద్రరావు, చలసాని వాసు, శివమరాకష్ణ, దాసరి రామకష్ణ, వల్లభనేని మాధవి, వేములపల్లి హిమాదేవి, చలసాని రోజా, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



## బెజవాడ హాస్పిటల్ అండ్ డయాగ్నొస్టిక్ ప్రారంభం



**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ** : నాలుగు దశాబ్దాలుగా బెజవాడ డయాగ్నోస్టిక్స్ నమ్మకంతో కూడిన బ్లడ్ రిపోర్ట్స్ సమయానికి అందిస్తూ ప్రజల మన్ననలు పొందిందని డాక్టర్ చలసాని రాజేంద్రప్రసాద్ తెలియజేసారు. ఇప్పుడు మరిన్ని సేవలు అందించేందుకు బెజవాడ హాస్పిటల్ అండ్ డయాగ్నొస్టిక్ ప్రారంభించినట్లు తెలిపారు. గవర్నర్ పేటలోని కోదండ రామిరెడ్డి స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భవనం ప్రారంభోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. అనంతరం చలసాని రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు విశ్వాసమైన సేవలు అందజేసామని ఇప్పుడు మరింత విస్తతం చేస్తున్నామని అన్నారు. ఈ నూతన హాస్పిటల్‌లో ట్రామా, లింబ్ రీ కన్‌స్ట్రక్షన్‌లోనూ ప్రముఖ ఆర్థోపెడీషియన్ ప్రశాంత్ చలసాని ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు కూడా చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ రూప కొల్లి, చలసాని పరిమళ, కావ్య మిక్కినేని మరియు హస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కారును ఢీకొన్న ప్రయివేటు బస్సు

## గుంటుపల్లిలో ప్రైవేటు బస్సు బీభత్సం

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** గుంటుపల్లిలో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ బస్సు శనివారం రాత్రి బీభత్సం సష్టించింది. ఈ ఘటనలో 3 ద్విచక్ర వాహనాలు 2 కార్లు ధ్వంసం అయ్యాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు గుంటుపల్లి గ్రామంలో బ్రేకులు ఫెయిల్ అయి ముందు వెళ్తున్న కారును ఢీకొంది. ఆ కారు ముందు వెళ్తున్న మరో కారును, ఆ కారు ముందు వెళ్తున్న 2 బైక్ లను ఢీకోంది. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బైక్‌లపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీను తెలిపారు.

## సిపిఎం సీనియర్ నాయకురాలు చిట్టెమ్మ మృతి



నివాళులర్పిస్తున్న బాబూరావు, తదితరులు



**విజయవాడ :** సిపిఎం 64వ డివిజన్ సీనియర్ నాయకులు, మహిళా సంఘం నాయకులు కొంగర చిట్టెమ్మ (75) ఆదివారం మృతిచెందారు. ప్రజాశక్తి నగర్‌లోని ఆమె స్వగహం వద్ద మరణించారు. ఆమె మృతదేహాన్ని సందర్శించిన నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడారు. ఆమె ఆలోచనలను ముందుకు తీసుకు వెళతామని అన్నారు. 40 సంవత్సరాలు కమ్యూనిస్టు ఉద్యమంలో ఆమె కొనసాగారని, మహిళా సంఘం అభివృద్ధిలో, పార్టీ పోరాటాల్లో ముందుండే వారని అన్నారు. తుది శ్వాస వరకూ పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారన్నారు. అనంతరం అంతిమయాత్రలో పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీదేవి, సాంబిరెడ్డి, వెంకటరెడ్డి ఝాన్సీ, పిచ్చమ్మ, సురేష్, క్రాంతి తదితరులు తపాల్గొన్నారు.

# 17న ఆక్వా డైమండ్స్ షోరూం ప్రారంభం

### ఘనంగా ప్రీ లాంచింగ్ కార్యక్రమం



మాట్లాడుతున్న నిర్వాహకులు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** వజ్రాభరణాల రంగంలో పేరొందిన ఆక్వా డైమండ్స్ సంస్థ విజయవాడలో ఈ నెల 17వ తేదీన షోరూమ్‌ని ప్రారంభించనున్నామని ఆక్వా డైమండ్స్ మేనేజింగ్ పార్టనర్స్ పి.అనురాధ, ఎ.గాయత్రి తెలిపారు. షోరూం ప్రారంభం సందర్భంగా ప్రీ లాంచ్ కార్యక్రమం నగరంలోని హోటల్ నోవాటెల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా డైమండ్స్‌లో ఆకర్షణీయమైన డిజైన్లలో రూపొందించిన విభిన్న శ్రేణి ఆభరణాలను ప్రదర్శనగా ఉంచామని, ఆభరణాలకు మహిళల నుండి మంచి స్పందన లభించిందని అన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా సంప్రదాయ ఆధునిక మేళవింపుతో రూపొందించిన ఆభరణాలు మగువలను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ నెల 17న విజయవాడ లబ్బీపేటలో షోరూం ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలు కోరుకునే రీతిలో అధునాతన డిజైన్లలో ఆభరణాలు లభిస్తాయని వారు చెప్పారు. గౌరీ సిల్క్స్‌కి ఏంతో మంచి పేరు ఉందని వారు చెప్పారు. పట్టణాలు, నగరాల్లో గౌరీ సిల్క్స్‌ని ప్రజలు ఎంతగానో ఆదరిస్తారని వారు గుర్తు చేశారు. ఆక్వా జ్యూయలరీకి సొంత మ్యానుఫాక్చరింగ్ యూనిట్ ఉందని చెప్పారు. మన్నిక నాణ్యతకు ఆక్వా జ్యువలరిలో తిరుగు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో అక్వా డైమండ్స్ ఫౌండర్ చేతన్ అగర్వాల్, ఆకతి గ్రూప్ అధినేత గుర్రం మురళి, గౌరీ సిల్క్స్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటిలు, పెయిడ్ హాలిడేస్ అమలు చేయాలి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:** హెచ్‌పిసిఎల్ ఎల్పిజి కాంట్రాక్టు వర్కర్స్‌కి ఓటీలు, పెయిడ్ హాలిడేస్ అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. కొండపల్లి హెచ్‌పిసిఎల్ ఎల్పిజి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం మెయిన్ గేటు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎఫ్ ఇఎస్ఐ రెగ్యులర్‌గా కాంట్రాక్టర్స్‌తో కట్టించలేని యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, చట్టబద్ధమైన ఓటిలు పెయిడ్ హాలిడేస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం చట్ట సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో పోరాటం ఉధతం చేస్తామని హెచ్చరించారు. హెచ్.పిసిఎల్ ఎల్ పిజీ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 14 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులు – ఎం.మహేష్, ప్రెసిడెంట్ – ఎం జీవరత్నం, వైస్ ప్రెసిడెంట్స్ జె నాగరాజు, కె రమేష్ జనరల్ సెక్రటరీ – ఆర్ వి వి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ – ఆర్ సురేష్, కోశాధికారి –1 బాబు నాయక్, కోశాధికారి 2 బి రాము నాయక్, కమిటీ సభ్యులుగా టి.శ్రీనివాస్,జె గంగరాజు, బి బాలాజీ, ఎఅనిల్, వై.అంబేద్కర్, సిహెచ్ రవి, కె. సురేంద్ర ఎన్నికయ్యారు.



మెయిన్ గేటు వద్ద మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

# విద్యార్థులకు తీరని కష్టాలు

**2018లో ధ్వంసమైన కట్టలేరు వంతెన**
**వర్షం పడితే స్తంభిస్తున్న రాకపోకలు**
**ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**



విద్యార్థులను వంతెన వరకు బస్సులో తీసుకొస్తున్న దృశ్యం



నిర్మాణానికి నోచుకోని వంతెన

**ప్రజాశక్తి - గంపలగూడెం: కట్టెలేరు వంతెన ధ్వంసంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. 2018 ఆగస్టులో దెబ్బతిన్న ఆ వంతెనను పునరుద్ధరించిన నాథుడే లేడు. ఒకవైపున అధికార, ప్రతిపక్షాలు నాడు తాము కడతామంటే తాము కడతామని ప్రకటనలు చేశారు తప్ప పని జరగలేదు. దీనితో వంతెనకు ఇరువైపులా 20 గ్రామాల ప్రజలకు కష్టాలు 6 సంవత్సరాలుగా వెంటాడుతూనే ఉన్నాయి. ప్రయాణికులు, రైతుల పరిస్థితులు ఎలా ఉన్నా..? విద్యార్థులు తీవ్రమైన సంక్షోభంలో పడ్డారు అనడానికి ఇదో పెద్ద నిదర్శనం.**

ఎప్పుడు రెండు రోజులు పాటు వర్షం పడినా విద్యార్థులకు సెలవులే. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళ గడిచిన దాని ఊసే లేదు. వంతెనకు అవతల గ్రామాలైన కనుమూరు, అనుములంక, నారికంపాడు, వినగడప,కొత్తపల్లి, గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ప్రయాణించాలంటే మరో 15 కిలోమీటర్లు దూరంతో పాటు సమయం, ఖర్చు,పెరుగుతుంది. అయినప్పటికీ ప్రయాణ సౌకర్యం ఉండదు. వంతెనకు ఇవతల గ్రామాలైన గంపలగూడెం, అమ్మిరెడ్డిగూడెం, మేడూరు, చింతలనర్వ, లింగాల, సుబ్బాల గొల్లపూడి, ఆర్లపాడు, తదితరాలైన 14 గ్రామాల ప్రజలను ఇవే పరిస్థితులు వెంటాడుతున్నాయి. మరో నాలుగు నెలల్లో 2024 సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణం అయ్యే మార్గం లేదని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరో రెండేళ్ల మనకి కష్టాలు తప్పవని ప్రజలు ఒక అవగాహనకు వచ్చారు.

**పోలీసులకు తప్పని కష్టాలు:-**

ప్రతిసారి ఒకటి రెండు రోజుల వర్షానికి వేసిన డైవర్షన్ రహదారి కొట్టుకుపోవడం ప్రజల ప్రయాణానికి అడ్డంకి ఏర్పడటం మనం చూస్తున్నాం. దీనితో ప్రమాదాలు వాటిల్లకుండా స్థానిక పోలీసులు వంతెనకు ఇరువైపులా ఇద్దరూ లేదా ముగ్గురు పోలీసులు భద్రతా చర్యల నిమిత్తం అక్కడే ఉండాల్సి వస్తుంది. చలైన, ఎండైనా, వర్షం అయినా వారికి ఇబ్బందులు తప్పడం లేదు. రోజువారి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతుంది. స్టేషన్లో ఏదైనా ఫిర్యాదు వస్తే దూర గ్రామాలకు వెళ్లాలంటే ఒక కానిస్టేబుల్ సైతం అందుబాటులో ఉండే పరిస్థితి లేదనేది సుస్పష్టం.

**ఎమ్మెల్యే ప్రసంగాలు వట్టివేనా...?**

గంపలగూడెం మండలానికి వచ్చిన ప్రతిసారి తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి ఇంకేముంది వంతెన నిర్మాణానికి కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలుస్తున్నామని, పనులు చేపడుతున్నామంటూ అనేకమార్లు నెరవేరని ప్రసంగాలతో ప్రజలను విసిగించారు. దీనితో ఎమ్మెల్యేపై ఈ ప్రాంత ప్రజలకు నమ్మకం పోయినట్లు బాహాటంగా చెబుతున్నారు. మండలానికి చెందిన నాయకులు ఈ వంతెన సమస్యపై ఏమాత్రం పట్టించుకోరు. మొదటి దశలో డైవర్షన్ రహదారి పునరుద్ధరణలో భాగంగా కాంట్రాక్టు పనులు తమకు వస్తాయంటే తమకు వస్తాయనే ఆశతోఇబ్బడి ముబ్బడిగా ఆ ప్రాంతం పట్టనంతమంది నాయకులు హడావిడిగా వచ్చి ఫోటోలు దిగిపోయారు. కానీ వంతెన సమస్యపై ఏ నాయకుడూ గడిచిన నాలుగేళ్లలో మాట్లాడలేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనితో స్థానిక నాయకులు పై కూడా ప్రజలు నమ్మకాన్ని కోల్పోవడం నిజమనే చెప్పొచ్చు.

**19 లక్షల ఖర్చా...?**

గడిచిన ఆగస్టు నెలలో వంతెన రహదారి కొట్టుకుపోవడంతో కొన్ని తూరలు వేసి తాత్కాలికంగా గ్రావులు వేశారు దీనికి 19 లక్షల పైగా బిల్లులు చేయించుకున్నట్లు ప్రతిపక్షాలతో పాటు ప్రజలు విమర్శిస్తున్నారు మహా అయితే 3 నుండి 4 లక్షలు అయ్యే ఖర్చుకు ప్రభుత్వ ధనాన్ని అంతలా దోచుకోవాలా? అంటూ ప్రశ్నిస్తున్నారు. వంతెన శాశ్వత నిర్మాణం ఎలా ఉన్నా, తిరిగి వెంటనే తాత్కాలిక రహదారి పునరుద్ధరించాలని, మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుచున్నారు.



**కొండూరు విజయ సాయినాథ్ రెడ్డి అనుములంక, పదవ తరగతి**

వంతెన ఉంటే సైకిల్ వేసుకొని వెళతాను. ప్రతిరోజు అనుములంక గ్రామం నుండి తోటమూల గాయత్రి స్కూలుకు వెళ్ళాలి. ఈ వంతెన లేకపోవడంతో నాకు క్లాసులు పోతున్నాయి. త్వరగా పనులు చేయాలి.

**ప్రభుత్వం వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేయాలి**

**వై.సౌజన్య, అనుములంక గ్రామం**



నేను తోటములలో గీతాంజలి విద్యాలయంలో చదువుకుంటున్నాను. ఈ సంవత్సరం 10వ తరగతి అయినందున నిత్యం అదనపు క్లాసులు కొనసాగుతున్నాయి. ఒక్క రోజైనా స్కూలుకు వెళ్లకపోతే క్లాసులు మిస్సవుతాను, యాజమాన్యం ఊరుకోవడంలేదు. కానీ ఇక్కడ వంతెన లేకపోవడంతో అనేక రోజులు స్కూల్ మానేయాల్సి వస్తుంది.

**క్లాసులు పోతున్నాయి**

**పాలెపు ఉమా అనుదీప్, పదవ తరగతి, నారికెంపాడు గ్రామం**



నేను పదో తరగతి చదువుతున్నాను. మా ఊరు నుండి తోటమూల స్కూలుకు సుమారు పది కిలోమీటర్లు. రోజు శ్రీ గాయత్రి పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. వంతెన లేనందున ప్రతిసారి క్లాసులు పోతున్నాయి. దీనితో నా చదువుకు ఆటంకం కలుగుతుంది.